

స్వచ్ఛతా హి సేవలో భాగస్వాములు కావాలి: కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 16: 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువతీ యువకులు, స్వచ్ఛంద సంస్థలు, సీనియర్ సిటిజన్స్, పారిశ్రామిక వేత్తలు, వ్యాపార సంస్థలు భాగస్వాములు కావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం 'స్వచ్ఛతా హి సేవ' గోడపత్రికను తన కార్యాలయంలో ఆవిష్కరించారు. మంగళవారం ఉదయం 7గంటలకు శ్రీకాకుళం కార్పొరేషన్ కార్యాలయం ఆవరణ నుంచి 'స్వచ్ఛతా హి సేవ' ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు.



శ్రీకాకుళం కొన్నవీధిలో వినాయక విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు



బై.. బై.. వినాయక

వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. సోమవారం రాత్రి శ్రీకాకుళంలోని కొన్నావీధి భీమేశ్వరాలయం, బలగ, గుజరాతీపేటలోని శ్రీరామ మందిరం, తదితర మండపాల్లో కొలువైన వినాయక విగ్రహాలను ఊరేగించారు. మహిళలు, యువత పెద్దఎత్తున పాల్గొన్నారు. మేళతాళాలతో నృత్యాలు చేస్తూ.. నాగావళి నది వద్దకు ఊరేగింపుగా చేరుకుని.. అక్కడ విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

- శ్రీకాకుళం కల్చరల్



శాంతి ర్యాలీ

'మిలాద్-ఉన్-నబీ' సందర్భంగా సోమవారం శ్రీకాకుళంలో ముస్లిమ్‌లు శాంతి ర్యాలీ నిర్వహించారు. జామియా మసీదు నుంచి ర్యాలీ ప్రారంభించారు. ఏడురోడ్ల కూడలి మీదుగా డేఅండ్ నైట్ జంక్షన్ నుంచి రైతుబజారు మీదుగా మళ్లీ జామియా మసీదుకు ర్యాలీ చేరుకుంది. అనంతరం నమాజ్ చేశారు. జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు మహిబుల్లాఖాన్ మాట్లాడుతూ మహ్మద్‌ప్రవక్త.. శాంతి, ఐక్యతను నెలకొల్పుతూ చూపిన మార్గం అనుసరణీయమని తెలిపారు. అందరూ సోదరభావంతో కలసిమెలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు హాజిబయ్యా, సెక్రటరీ అక్బర్ బాషా, జాయింట్ సెక్రటరీ షకూర్ ఖాన్, ట్రెజరర్ ఉస్మాన్, సుమారు 600 మంది ముస్లిమ్‌లు పాల్గొన్నారు. - శ్రీకాకుళం కల్చరల్

ఎందుకీ దుస్థితి?

- నాడు 600 మందికిపైగా విద్యార్థులతో కళకళ
- నేడు ఒక్కరూ లేని వైనం
- సీడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులే దిక్కు
- పొందూరు ఎంపీపీ పాఠశాల-2 పరిస్థితి ఇదీ



పొందూరు ఎంపీపీ పాఠశాల-2

మూడు దశాబ్దాల కిందట రేకుల షెడ్డులు, పూరిపాకలే తరగతి గదులు. కూర్చోవడానికి సరైన స్థలం లేకపోయినా.. ఈ పాఠశాలలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపేవారు. నాడు 600 మంది విద్యార్థులతో పాఠశాల కళకళలాడేది. నేడు ఒక్క విద్యార్థి అయినా చేరకపోతాడా? అని ఎదురు చూడాల్సి వస్తోంది. ఇదీ పొందూరులోని ఎంపీపీ-2 (దాసు మాస్టర్ స్కూల్) పాఠశాల దుస్థితి. ఈ పాఠశాలకు గత వైభవం వచ్చేలా ప్రభుత్వం దృష్టి సారించాలని పూర్వ విద్యార్థులు, ప్రజలు కోరుతున్నారు.

(పొందూరు)

విద్యారంగంపై ప్రభుత్వాల అనాలోచిత విధానాలు, కొంతమంది ఉపాధ్యాయుల్లో కొరవడిన నిబద్ధత, మరోవైపు కార్పొరేట్ విద్యా సంస్థల ప్రభావంతో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దయనీయంగా మారుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా.. మరోవైపు సౌకర్యాలు కల్పిస్తున్నా.. విద్యార్థులను ఆకర్షించలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లోనూ విశ్వాసం సన్నగిల్లడంతో.. విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ఇందుకు పొందూరు పట్టణ నడిబొడ్డున ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల- 2(దాసు మాస్టర్ స్కూల్) నిదర్శనంగా నిలుస్తోంది. 1990కి ముందు పూరిపాకలు, రేకుల షెడ్‌లతో ఉన్న ఈ పాఠశాల.. 600 మంది విద్యార్థులతో నిండుగా కనిపించేది. చిత్తశుద్ధి, నిబద్ధత కలిగిన ఉపాధ్యాయులు.. అత్యున్నత ప్రమాణాలు, సృజనాత్మకతతో బోధన సాగించేవారు. దీంతో ఈ పాఠశాల.. మండలం, జిల్లాతోపాటు రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల మన్ననలు అందుకుంది. ఈ పాఠశాలలో చదివినవారిలో చాలామంది ఉపాధ్యాయులుగా, వైద్యులుగా, ఇంజనీర్లుగా, ఉన్నత ఉద్యోగులుగా, ఎన్ఆర్ఐలుగా స్థిర పడ్డారు. అందుకే అప్పట్లో ఈ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపేవారు. కానీ.. ప్రస్తుతం కారణాలేమైనా.. విద్యార్థులు లేక పాఠశాల వెలవెలబోతోంది. ఈ పాఠశాలలో చేర్పించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ముఖం చాటేస్తున్నారు. గతంలో పాఠశాలలో గాంధీ జయంతిని.. గ్రామస్థుల సహపంక్తి భోజనాలతో వేడుకగా నిర్వహించేవారు. నేడు పాఠశాలలోని గాంధీ కాంస్య విగ్రహానికి ఆలనాపాలనా లేక శిథిలావస్థకు చేరుకుంది. పాఠశాల దుస్థితి చూసి.. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ఐదుగురు సీడబ్లూఎస్ఎన్ విద్యార్థులే..

గత పదేళ్ల నుంచి పొందూరు ఎంపీపీ-2 పాఠశాల పరిస్థితి దిగజారుతోంది. నాడు వందలాది మందితో కళకళలాడే ఈ పాఠశాలలో ప్రస్తుతం.. రెగ్యులర్ విద్యార్థి ఒక్కరూ లేరు. సీడబ్ల్యూఎస్ఎన్(ప్రత్యేక అవసరాల గల పిల్లలు) విద్యార్థులు ఐదుగురు మాత్రమే ఉన్నారు. గతేడాది ముగ్గురు రెగ్యులర్ విద్యార్థులు ఉండేవారు. గత వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన విధానాల కారణంగా.. పొందూరులోని దివ్యాంగ విద్యార్థుల కోసం ప్రారంభించిన భవిత కేంద్రాన్ని ఈ పాఠశాలలో విలీనం చేశారు. దీంతో ఈ పాఠశాలలో ఆరుగురు సీడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులు చేరారు. ఈ ఏడాది అందులో ఒక విద్యార్థి పాఠశాల నుంచి వెళ్లిపోయి.. మరో పాఠశాలలో చేరాడు. ప్రస్తుతం ఐదుగురే మిగలగా.. వారికి ఐఈఆర్టీ ఉపాధ్యాయులు బోధన సాగిస్తున్నారు. కాగా.. ఈ ఏడాది జూన్‌లో ఇద్దరు రెగ్యులర్ విద్యార్థులు ఉండేవారు. వారిద్దరూ నెలరోజుల కిందట టీసీలు తీసుకుని ప్రైవేటు పాఠశాలల్లో చేరారు. దీంతో రెగ్యులర్ విద్యార్థులు లేక.. రెగ్యులర్ ఉపాధ్యాయుడ్ని ఎంఈవో పూల్‌లో పెట్టారు.

● ఇదిలా ఉండగా.. గత ఐదేళ్లలో విద్యార్థులు అంతగా లేకపోయినా.. 'నాడు-నేడు' పనుల కోసం రూ.16 లక్షలు వెచ్చించడం విమర్శలకు దారి తీసింది. నేడు పాఠశా లను ఎత్తివేసే పరిస్థితి దాపురించిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పాఠశాల పునర్వైభవానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



సీడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులు

పాఠశాలను చూస్తే బాధగా ఉంది



నేడు పాఠశాలను చూస్తే బాధగా ఉంది. ఒకప్పుడు వందల మంది విద్యార్థులతో ఉండే పాఠశాలలో నేడు ఒక్కరూ లేకపోవడం బాధాకరం. పట్టణవాసులు, పూర్వవిద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాఠశాలకు పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేయాలి.

- దాసుమాస్టర్, పాఠశాల పూర్వ హెచ్ఎం

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



పాఠశాల దుస్థితిని చూస్తే ఆవేదనగా ఉంది. ఈ పాఠశాలలో చదవడం గౌరవంగా భావించేవాళ్లం. ప్రస్తుతం ఒక్క విద్యార్థీ ఎందుకు చేరడం లేదో అర్థం కావడం లేదు. పొందూరుకు గౌరవం తీసుకువచ్చిన ఈ పాఠశాలలో విద్యాసంస్థనే ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పూర్వవిద్యార్థులుగా మా సహకారం అందిస్తాం.

- హంస రవికిరణ్(బాబి), ఎన్ఆర్ఐ, పాఠశాల పూర్వవిద్యార్థి

నివేదిక అందజేస్తాం

ఈ ఏడాది ఇద్దరు రెగ్యులర్ విద్యార్థులు టీసీలు తీసుకుని వెళ్లిపోయారు. దీంతో పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడిని ఎంఈవో పూల్‌లో పెట్టాం. పాఠశాల పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తాం.

- పీవీ రామరాజు, ఎంఈవో-1, పొందూరు

విద్యారంగం అస్తవ్యస్తం

- భ్రష్టు పట్టించిన వైసీపీ ప్రభుత్వం
- పదోన్నతుల కోసం ఉపాధ్యాయుల ఎదురుచూపు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

(పాతపట్నం)

గత వైసీపీ ప్రభుత్వం జీవో నెంబర్ 117 జారీ చేసి.. విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిందని ఉపాధ్యాయుడు గగ్గోలు పెట్టారు. విలీనం పేరిట పాఠశాలలను కుదించింది. అలాగే ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించి.. విద్యాప్రమాణాలు దెబ్బతీసింది. నియామకాలు చేపట్టక పోగా.. పదోన్నతులు కల్పించకపోగా.. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నచోట గ్రేడ్-2 పోస్టులను తొలగించింది. దీంతో ఉపాధ్యాయుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్పందించి విద్యారంగం ప్రక్షాళనకు చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. నియామకాలు చేపట్టాలని.. పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

● జిల్లాలోని సుమారు 247 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయంతో 98 మంది కన్నా తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలో గెజిటెడ్(గ్రేడ్-2) ప్రధానోపాధ్యాయుల పోస్టులు తొలగించింది. ఈ మేరకు జిల్లాలో సుమారు 34 మంది గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులను తొలగించారు. దీంతో పాఠశాల పర్యవేక్షణ దెబ్బతింది. మరికొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యాబోధన సక్రమంగా సాగని దాపురించింది. ఇటీవల పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల్లో హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్‌లే అధికంగా ఉన్నారు. దీంతో మరిన్ని ప్రధానోపాధ్యాయుల పోస్టుల ఖాళీలు ఏర్పడ్డాయి. సీనియర్ ఉపాధ్యాయులే ఇన్‌చార్జి హెచ్ఎంలుగా వ్యవహరిస్తున్నారు. కాగా.. అదనపు పర్యవేక్షణ బాధ్యతలతో బోధన సక్రమంగా సాగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పనిభారం పెరిగిపోతోందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని పలువురు విద్యావేత్తలు కోరుతున్నారు. పూర్తిస్థాయిలో ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. జీవో నెంబరు 117 రద్దు చేయాలని వేడుకుంటున్నారు.

117 జీవో రద్దు చేయాలి



ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల బోధనా పర్యవేక్షణకు గండికొట్టే జీవో నెంబర్ 117ను వెంటనే రద్దు చేస్తేనే సత్ఫలితాలు ఉంటాయి. ఈ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- నల్ల శ్రీనివాసరావు, జేఏసీ మండలశాఖాధ్యక్షుడు పాతపట్నం

హెచ్ఎంలు ఉండాల్సిందే..



ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా బోధనలు జరగాలంటే ప్రతీ ప్రభుత్వ పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుండాలి. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలి.

- అమర జనార్దనరావు, పీఆర్టీయూ మండలశాఖాధ్యక్షుడు, పాతపట్నం

పదోన్నతులు కల్పించాలి



ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్‌లకు సత్వర పదోన్నతులు కల్పించాలి. అలా అయితే.. బోధన సక్రమంగా సాగుతుంది. ఈ విద్యాసంవత్సరంలో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు.

- సూర పాపారావు, నోబుల్ టీచర్స్ జిల్లా అధ్యక్షుడు

ఇద్దరిని నియమించాలి



పదోన్నతులు వెంటనే చేపట్టాలి. ఏకోపాధ్యాయ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులుండేలా చర్యలు తీసుకోవాలి.

- బావన మల్లేశ్వరరావు, పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి

'సీసీటీఎన్ఎస్'లో కేసు వివరాలు నమోదు చేయాలి

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 16: కేసు నమోదు నుంచి అభియోగ పత్రాలు దాఖలు వరకు ప్రతి అంశాన్నీ సీసీటీఎన్ఎస్ అప్లికేషన్‌లో నమోదు చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, వివిధ కోర్టుల్లో సమన్వయాధికారులుగా పని చేస్తున్న కోర్టు మానిటరింగ్ సిస్టమ్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ కేసుల పరిష్కారం, శిక్షలు పడేందుకు కోర్టు కానిస్టేబుల్ విధులు చాలా కీలకమని తెలిపారు. వివిధ కోర్టుల్లో విచారణలో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నెలవారీ కోర్టులు జారీ చేసిన సమన్లు, వారంట్లను పోలీసుస్టేషన్ ప్రోసెస్ రిజిష్టర్‌లో నమోదు చేసి, రికార్డు నిర్వాహణ సక్రమంగా ఉండాలని తెలిపారు. పీపీతో సమన్వయం చేసుకుంటూ శిక్షలు శాతం పెరిగేలా కృషి చేయాలన్నారు. పెండింగ్ కేసుల విచారణ త్వరితగతిన ప్రారంభమయ్యేలా చూడాలని తెలిపారు. కేసు ప్రాపర్టీ సకాలంలో ప్రవేశపెట్టి, నిందితు లకు శిక్ష పడేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి రోజు కోర్టులో జరిగే సాక్షుల విచారణ, అభి యోగ పత్రాలు దాఖలు, సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ తదితర అంశాలను ఎప్పటికప్పుడు అధికారులు దృష్టిలో పెట్టాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఎంఎస్ ఎస్ఐ పారినాయుడు, డీసీఆర్బీ ఎస్ఐ నేతాజీ, కోర్టు కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, హాజరైన పోలీసు అధికారులు

మంచి నీళ్లు అడిగి.. మహిళను బెదిరించి..

- రూ.4 లక్షల బంగారు ఆభరణాలు దోపిడీ

పలాస, సెప్టెంబరు 16: స్థానిక శివాజీనగర్ రెండో వీధిలో నివాసం ఉంటున్న పెంట కృష్ణవేణి నివాసం వద్దకు సోమవారం సాయంత్రం ఓ ఆగంతకుడు మాస్క్ ధరించి వచ్చాడు. ఇంటి బయట కూర్చొని ఉన్న ఆమె వద్దకు వెళ్లి దాహం వేస్తుందని.. మంచినీళ్లు కావాలని అడిగాడు. ఆమె లేవని చెబుతూ.. ఇంట్లోకి వెళ్లిపోయింది. ఆమె వెంటే.. ఆ ఆగంతుకుడు ఇంట్లోకి ప్రవేశించాడు. ఆమెను బెదిరించి.. మెడలో ఉన్న రూ.4 లక్షల విలువైన పుస్తెలతాడు, బంగారు ఆభరణాలు దోచుకున్నాడు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చేలోపు.. అక్కడి నుంచి పరారయ్యాడు. కృష్ణవేణి భర్త విష్ణుమూర్తి పాత జాతీయరహదారి వద్ద కిరాణా షాపును నిర్వహిస్తున్నారు. ఇంట్లో ఒక్క మహిళ మాత్రమే ఉండడంతో దొంగతనం చేయడానికి మార్గం సులభమైంది. ఈ చోరీపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటన స్థలాన్ని కాశీబుగ్గ పోలీసులు పరిశీలించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ డి. మోహనరావు తెలిపారు.



బాధితురాలు కృష్ణవేణి

వన్యప్రాణుల బాధితులకు పరిహారం పెంపు

మెళియాపుట్టి, సెప్టెంబరు 16: వన్యప్రాణుల నుంచి ప్రాణ, పంట నష్టం కలిగే బాధితులకు నష్ట పరిహారాన్ని పెంచుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఉమ్మడి జిల్లాలో 70,876.02 హెక్టార్లలో అటవీ భూమి ఉంది. ఈ అటవీ భూముల నుంచి ఏనుగులు, ఎలుగుబంట్లు తదితర వన్యప్రాణులు జనావాసాల్లోకి వచ్చి.. పంటలను ధ్వంసం చేస్తున్నాయి. తరచూ ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయి. ఒడిశా రాష్ట్రం లకేరి అభయారణ్యం నుంచి ఎనిమిది ఏనుగుల గుంపు జిల్లాకు 2017లో తరలివచ్చింది. అప్పటి నుంచీ ఏనుగులు రైతులకు పంట నష్టం కల్గిస్తున్నాయి. సుమారు వెయ్యి ఎకరాల పంటలను ధ్వంసం చేశాయి. అలాగే ఏనుగుల దాడిలో గత ఐదేళ్లలో పది మృతి చెందినట్టు అటవీశాఖ అధికారులు గుర్తించారు. కాగా.. బాధిత కుటుంబాలను ఆదుకోవడం గత వైసీపీ ప్రభుత్వం మొక్కుబడిగా వ్యవహరించింది. నష్ట పరిహారం సైతం సకాలంలో చెల్లించకపోవడంతో బాధిత కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో నష్ట పరిహారాన్ని పెంచుతూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకూ వన్యప్రాణుల దాడిలో ప్రాణ నష్టం జరిగితే.. ఒక్కో బాధిత కుటుంబానికి రూ.5లక్షలు చెల్లించేవారు. ప్రస్తుతం ఆ పరిహారాన్ని రూ.10లక్షలకు పెంచారు. వరి, చెరకు వంటి పంటలకు నష్టం వాటిల్లితే ఎకరాకు రూ.8వేలు ఇవ్వగా.. దానిని రూ.12వేలకు పెంచారు. ఉద్యాన పంటలకు సంబంధించి ఎకరాకు రూ.7,500 నుంచి రూ.12వేలు అందజేయనున్నారు. మామిడి తోటలకు ఎకరాకు గతంలో రూ.1,500 ఇవ్వగా.. దానిని రూ.2వేలకు పెంచారు. నష్ట పరిహారం పెంచడంపై బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జిల్లాలో సంచరించిన ఏనుగులు (ఫైల్)

మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి క్యాట్



దరఖాస్తు గడువు తేదీ సెప్టెంబరు 20కి పొడిగింపు

మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన పరీక్ష 'కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)' దరఖాస్తు గడువు తేదీని పొడిగించారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబరు 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించే క్యాట్‌లో సాధించిన పర్సంటైల్ ఆధారంగా సీట్లను కేటాయిస్తారు. క్యాట్ స్కోరు ఆధారంగా ఐఐఎంలే కాకుండా ఇతర ప్రముఖ కళాశాలలు కూడా సీట్లను భర్తీ చేస్తాయి. ఈ ఏడాది పరీక్షను దేశవ్యాప్తంగా 170 నగరాల్లో నిర్వహించనున్నారు.

ఐఐఎంలు: ముంబయి, అమృత్‌సర్, బెంగళూరు, బోధ్ గయా, కోల్‌కతా, ఇండోర్, జమ్ము, కాశీపూర్, కోజికోడ్, లఖ్‌నవూ, నాగ్‌పూర్, రాయ్‌పూర్, రాంచీ, రోహ్‌తక్, సంబల్‌పూర్, షిల్లాంగ్, సిర్మౌర్, తిరుచిరాపల్లి, ఉదయపూర్, విశాఖపట్నం.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 45 శాతం మార్కులు చాలు. డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం: ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. పరీక్షలో మూడు విభాగాలు ఉంటాయి. సెక్షన్-1 వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్, సెక్షన్-2 డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్, సెక్షన్-3 క్వాంటిటేటివ్ ఎబిలిటీ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు మూడు మార్కులు కేటాయించారు. పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఆయా సంస్థలు గ్రూప్ డిస్కషన్స్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూస్ నిర్వహించి తుది ఎంపికను చేపడతాయి.

రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.2500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.1250 చెల్లించాలి.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, చిత్తూరు, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 20

అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్: నవంబరు 5 నుంచి 24 వరకు

పరీక్ష తేదీ: నవంబరు 24

ఫలితాల ప్రకటన: జనవరి రెండో వారంలో

వెబ్‌సైట్: https://iimcat.ac.in/

దిక్సూచి DIKSUCHI

ఎన్‌జీ రంగా వర్సిటీలో ఎన్ఆర్ఐ కోటా

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తు గడువు పొడిగించింది. అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు. పీజీ ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. పీహెచ్‌డీ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తిచేసే వీలుంది.



స్పెషలైజేషన్‌లు

అగ్రికల్చర్: జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్, ప్లాంట్ పాథాలజీ, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మైక్రో బయాలజీ, సాయిల్ సైన్స్, మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, ఎంటమాలజీ, ఆగ్రోనమీ, అగ్రికల్చరల్ ఎకనామిక్స్, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్.

అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ: సాయిల్ అండ్ వాటర్ కన్జర్వేషన్ ఇంజనీరింగ్, ప్రాసెస్ అండ్ ఫుడ్ ఇంజనీరింగ్, ఫామ్ మెషినరీ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ.

కమ్యూనిటీ సైన్స్(హోమ్ సైన్స్): ఫుడ్ అండ్ న్యూట్రిషన్, హ్యూమన్ డెవలప్‌మెంట్ అండ్ ఫ్యామిలీ స్టడీస్, రిసోర్స్ మేనేజ్‌మెంట్ అండ్ కన్జూమర్ సైన్స్, ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్.

సీట్ల వివరాలు: పీజీ ప్రోగ్రామ్‌లో 53 సీట్లు ఉన్నాయి. కమ్యూనిటీ సైన్స్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగాలకు ఒక్కోదానిలో రొటేషనల్ బేసిస్ మీద 6 సీట్లు నిర్దేశించారు. అగ్రికల్చర్ విభాగానికి 41 సీట్లు కేటాయించారు.

- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో 14 సీట్లు ఉన్నాయి. కమ్యూనిటీ సైన్స్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగాలకు ఒక్కో దానిలో రొటేషనల్ బేసిస్ మీద ఒక సీటు నిర్దేశించారు. అగ్రికల్చర్ విభాగానికి 12 సీట్లు కేటాయించారు.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు

హైదరాబాద్‌లోని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(యూఓహెచ్) 2024-25 విద్యా సంవత్సరానికిగాను వివిధ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి గడువు తేదీని పొడిగించింది. మొత్తం 22 పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఆల్ ఇండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ ద్వారా సీట్లను భర్తీ చేస్తారు. హైదరాబాద్, భువనేశ్వర్, కొచ్చి, పట్నా, ఢిల్లీ, గువాహటి, కోల్‌కతాల్లో ప్రవేశ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

స్పెషలైజేషన్లు - సీట్లు

- ఇంగ్లీష్-6, తెలుగు-19, ఉర్దూ-3, అప్లయిడ్ లింగ్విస్టిక్స్-8, హిస్టరీ-8, పొలిటికల్ సైన్స్-10, సోషియాలజీ-20, ఆంత్రోపాలజీ-9, ఎడ్యుకేషన్-2, రీజనల్ స్టడీస్-5, ఇండియన్ డయాస్పొరా-2, సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ-4, జెండర్ స్టడీస్-5, ఎకనామిక్స్-28, డ్యాన్స్-3, ఆర్ట్ హిస్టరీ అండ్ విజువల్ స్టడీస్-1, కమ్యూనికేషన్-3, ట్రాన్స్‌లేషన్ స్టడీస్-4, ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్టడీస్-8, హెల్త్ సైన్సెస్: ఆప్టోమెట్రి-2, మెటీరియల్స్ ఇంజనీరింగ్-16, నానో సైన్స్ అండ్ టెక్నాలజీ-4.
- ఇంతకు ముందు(నోటిఫికేషన్ తేదీ 2024 జూన్ 3) దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మరల దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు.


అర్హత: కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.550; ఓబీసీ-ఎన్‌సీఎల్ రూ.400; ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ(పీహెచ్) అభ్యర్థులకు రూ.275.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 20
- **హాల్ టిక్కెట్స్ డౌన్‌లోడ్:** అక్టోబరు 10
- **ప్రవేశ పరీక్ష తేదీలు:** అక్టోబరు 19, 20
- **ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** నవంబరు 18
- **ఇంటర్వ్యూలు :** నవంబరు 18 నుంచి 21 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** డిసెంబరు 2
- **అడ్మిషన్ కౌన్సిలింగ్ తేదీలు:** డిసెంబరు 10, 11
- **తరగతులు ప్రారంభం:** 2025 జనవరి 1
- **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in/

నవ్య | చిత్రజ్యోతి

బీస్ట్ మోడ్ ఆన్



బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రామ్‌చరణ్ ఓ చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి 'ఆర్‌సి16' అనేది వర్కింగ్ టైటిల్. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్‌లో ఉందీ చిత్రం. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. తాజాగా, రామ్‌చరణ్ ఓ ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసి ఈ సినిమాపై అంచనాలను రెట్టింపు చేశారు. "బీస్ట్ మోడ్ ఆన్. ఆర్‌సీ 16 లోడింగ్" అని పేర్కొన్నారు.

ఓనమ్ పర్వదినం సందర్భంగా 'కూలీ' సినిమా సెట్స్‌లో సూపర్‌స్టార్ రజనీకాంత్ స్టెప్పులేశారు. ఆయన నటిస్తున్న 'వేట్టయాన్' సినిమాలోని 'మానసిలాయో' పాటకు స్టెప్పులేసి ఆయన చిత్రబృందంలో జోష్ తెచ్చారు. ఈ సినిమాలోని కీలక సన్నివేశాల చిత్రీకరణ వైజాగ్‌లో జరుగుతున్న సంగతి తెలిసిందే.











వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి హీరో సాయిదుర్గ తేజ్ విరాళంగా ప్రకటించిన రూ. పది లక్షలు, హీరో విష్వక్‌సేన్ రూ పది లక్షలు, నిర్మాత సూర్యదేవర నాగవంశీ రూ. 25 లక్షలు, హాస్యనటుడు ఆలీ దంపతులు రూ. 3లక్షల చెక్కులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంతరెడ్డికి అందజేశారు.

ఇన్ ప్రోగ్రెస్

జైలుకి వెళ్లిన గొర్రె



సుహాస్ హీరోగా నటించిన యూనిక్ ఎంటర్‌టైనర్ 'గొర్రె పురాణం' ఈ నెల 20న విడుదల కానుంది. పురాణం బాబీ దర్శకత్వంలో ప్రవీణ్‌రెడ్డి నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. 'నా పేరు రామ్.. అలియాస్ యేసు. గొర్రె జైల్లో ఉండడం ఏందీ.. ఆడికెళ్లి తప్పించుకోవడం ఏంది? ఇదంతా మీకు వింతగా ఉంది కదూ' అనే వాయిస్ ఓవర్‌తో ట్రైలర్ మొదలైంది. ఒక గొర్రె ఓ గ్రామంలో రెండు మతాల మధ్య చిచ్చు పెట్టిన నేపథ్యాన్ని చాలా ఆసక్తికరంగా ప్రజెంట్ చేశారు. పోసాని కృష్ణమురళి, రఘు కీలక పాత్రలు పోషించారు.

మహిళల రక్షణ కోసం




ప్రవీణ్ కె.వి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మహీష'. యషిక, పృధ్వీరాజ్, వైష్ణవి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆదివారం ఈ సినిమా టీజర్‌ను దర్శకుడు కొండా విజయ్‌కుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "టీజర్ బాగుంది. మహిళల రక్షణ కోసం చేసిన చిత్రమిది" అని చెప్పారు. "ధర్మాన్ని ఎలా కాపాడాలో ఇందులో చూపిస్తున్నాం. ప్రేక్షకులకు కావాల్సిన అన్ని ఎలిమెంట్స్ ఇందులో ఉన్నాయి" దర్శకుడు, హీరో ప్రవీణ్ కె.వి అన్నారు.

తిన్నడి స్నేహితుడు



విష్ణు మంచు నటిస్తున్న 'కన్నప్ప' నుంచి ప్రతి సోమవారం వస్తున్న అప్‌డేట్లు సినిమా మీద అంచనాలు పెంచుతున్నాయి. ఈ సోమవారం తిన్నడికి విధేయుడు, స్నేహితుడు అయిన టిక్కీని పరిచయం చేశారు. టిక్కీ మరెవరో కాదు.. విష్ణు స్వారీ చేసే గుర్రం. టిక్కీతో ఉన్న విష్ణు పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో విష్ణు లుక్ ఆకట్టుకుంటోంది. డాక్టర్ మోహన్‌బాబు ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న 'కన్నప్ప' చిత్రానికి ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకుడు. డిసెంబర్‌లో ఈ భారీ చిత్రం విడుదల కానుంది.

నువ్వే నా సూర్యుడు.. చంద్రుడు



నటుడు సిద్ధార్థ్, నటి అదితీరావు హైదరీ సోమవారం వివాహబంధంలోకి అడుగుపెట్టారు. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు అదితి. 'నువ్వే నా సూర్యుడు.. చంద్రుడు.. నువ్వే నా తారాలోకం. మిసెస్ అండ్ మిస్టర్ అదు సిద్దు' అనే క్యాప్షన్‌ను ఆమె జత చేశారు. వీరి పెళ్లి ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్‌లోని వీరి వివాహం జరిగిందని అంటున్నారు కానీ అక్కడి ఆలయంలో మాత్రం ఆ ఛాయలేవీ కనిపించ లేదు. అక్కడ ఏ వివాహం కూడా జరగలేదని ఆలయ పూజారులు తెలియజేస్తున్నారు. మరెక్కడైనా ఆ వివాహం జరిగిందేమోననే భావన వ్యక్తమవుతోంది. అదితీరావు హైదరీ వనపర్తి సంస్థానాధీశుల్లో చివరి రాజుగా ఉన్న రామేశ్వర్‌రావు మనుమరాలు, ఆయన కూతురు విద్యారావు సంతానం అదితి. సిద్ధార్థ్, అదితి ఇద్దరికీ ఇది రెండో వివాహం. సిద్ధార్థ్ తన చిన్ననాటి స్నేహితురాలు మేఘనను 2003లో ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత 2007లో ఇద్దరి మధ్యలో వచ్చిన విభేదాల కారణంగా విడాకులు తీసుకున్నారు. అదితి 2002లో సత్యదీప్ మిశ్రాను పెళ్లి చేసుకొని 2012లో విడిపోయారు.


- ఆంధ్రజ్యోతి, శ్రీరంగాపూర్

ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చేలా..



చంద్రహాస్ హీరోగా నటిస్తున్న 'రామ్‌నగర్ బన్నీ' చిత్రం టీజర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ సినిమాలో విస్మయశ్రీ, రిచా జోషి, అంబికా వాణి, రీతూ మంత్ర హీరోయిన్లు. శ్రీనివాస్ మహత్ దర్శకుడు. అక్టోబర్ నాలుగున సినిమాను విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు మలయజ ప్రభాకర్, పొడకండ ప్రభాకర్ చెప్పారు. ఈ సినిమా కోసం చంద్రహాస్ బాగా కష్టపడ్డాడనీ, అతనికి మంచి పేరు తెచ్చే సినిమా అవుతుందని దర్శకుడు శ్రీనివాస్ మహత్ చెప్పారు. అన్ని ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులందరికీ నచ్చేలా చిత్రం ఉంటుందని తెలిపారు. ఫ్యామిలీ ఆడియన్స్‌ను దృష్టిలో పెట్టుకుని చిత్రకథ ఎన్నుకున్నామనీ, తన కుమారుడి మొదటి సినిమాను సకుటుంబంగా ప్రేక్షకులు చూడాలనుకున్నామనీ ప్రభాకర్ చెప్పారు మరో రెండు సినిమాలు ఉన్నా మొదట 'రామ్‌నగర్ బన్నీ'నే విడుదల చేస్తున్నామని తెలిపారు.

సండే గర్ల్ ఫ్రెండ్



కామ్నా శర్మ, సుమన్. అలీ ప్రధాన పాత్రలు పోషించే 'సండే గర్ల్ ఫ్రెండ్' షూటింగ్ సోమవారం ప్రారంభమైంది. హీరోయిన్ కామ్నాపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు నటి ఇంద్రజ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, అలీ తొలి క్లాప్ ఇచ్చారు. సుమన్ స్క్రిప్ట్ అందజేశారు. లవ్, మ్యూజికల్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉంటుందని దర్శకుడు గడ్డం వెంకటరమణారెడ్డి చెప్పారు. పాటల రికార్డింగ్ పూర్తయిందనీ, త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలు పెడతామనీ ఆయన తెలిపారు.

సైకలాజికల్ థ్రిల్లర్




ప్రిన్స్, నరేశ్ అగస్త్య హీరోలుగా నటించిన 'కలి' చిత్రం అక్టోబర్ 4న విడుదల కానుంది. జర్నలిస్టు రాఘవేంద్రరెడ్డి సమర్పణలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి శివ శేషు దర్శకుడు. కలి పాత్ర చుట్టూ అల్లుకున్న కథ ఇదనీ, ఈ సైకలాజికల్ థ్రిల్లర్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి కలిగిస్తుందనీ దర్శకుడు చెప్పారు. లీలా గౌతమ్ వర్మ ఈ సినిమాకు నిర్మాత. నేహా కృష్ణన్, గౌతంరాజు, గుండు సుదర్శన్, మణిచందన, మధుమణి ఇతర ముఖ్య తారాగణం.

బాలీవుడ్‌లో హీరోలు.. దక్షిణాదిలో విలన్లు

తెలుగు సినిమాల్లో ప్రతినాయక పాత్రలకు పరభాషా విలన్లను ఎంచుకోవటం మేకర్స్‌కు ఎప్పట్నుంచో ఉన్న ఆనవాయితీ. అయితే ఆ పరభాషా విలన్ల స్థానంలో ఇప్పుడు ఒకే ఇండస్ట్రీకి చెందిన నటులు ఎక్కువగా కనిపిస్తున్నారు. బాలీవుడ్‌లో హీరోలుగా ఉన్న ఎంతో మంది నటులు ఇప్పుడు దక్షిణాది సినిమాల్లో విలన్లుగా ఎంట్రీ ఇస్తున్నారు. అలా దక్షిణాదిలో విలన్లుగా మారిన వారెవరో ఓ లుక్కేద్దాం.









సైఫ్ అలీఖాన్

బాలీవుడ్‌లో మంచి హిట్ ట్రాక్ ఉన్న కథానాయకుల్లో సైఫ్ అలీఖాన్ ఒకరు. లవర్ బాయ్ నుంచి యాక్షన్ రోల్స్ వరకు ఎన్నో పాత్రల్లో నటించి మెప్పించిన ఆయన.. ప్రస్తుతం ప్రతినాయకుడిగా మారారు. ఇప్పటికే ఓం రౌత్ దర్శకత్వంలో ప్రభాస్ నటించిన పౌరాణిక చిత్రం 'ఆదిపురుష్' చిత్రంలో రావణుడి పాత్రను పోషించారు సైఫ్. ఇప్పుడు కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ నటిస్తున్న 'దేవర'లో 'భైర' పాత్రలో నటిస్తున్నారు. ఇటీవలే విడుదలైన 'భైర' గ్లింప్స్, ట్రైలర్‌తో సినిమాలో ఆయన పాత్ర ఎంత క్రూరంగా ఉంటుందో సినీ ప్రియులకు మేకర్స్ హింటిచ్చారు.

ఇమ్రాన్ హష్మీ

బాలీవుడ్‌లోనే మోస్ట్ రొమాంటిక్ హీరోల్లో ఇమ్రాన్ హష్మీ ఒకరు. సీరియల్ కిస్సర్‌గా పేరు తెచ్చుకున్న ఆయన.. ఇప్పుడు ప్రతినాయకుడి పాత్రలకు సిద్ధమయ్యారు. సుజీత్ దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ నటిస్తున్న 'దే కాల్ హిమ్ ఓజీ' (ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్)లో ఆయన ఓమి భాయ్ అనే పాత్రలో కనిపిస్తున్నారు. ఇమ్రాన్ బర్త్‌డే సందర్భంగా రిలీజైన పోస్టర్‌లో ఆయన పాత్ర ఎంతో పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని అర్థమవుతోంది.

సంజయ్ దత్

దక్షిణాదికి బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ హీరోగానూ.. విలన్‌గానూ ఇప్పటికే సుపరిచితం. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో యష్ హీరోగా నటించిన 'కేజీఎఫ్' సిరీస్‌లో 'అధీరా' పాత్రలో కరడుగట్టిన విలన్‌గా ఆయన కనిపించారు. గతేడాది లోకేశ్ కనగరాజ్, తమిళ నటుడు విజయ్ కలయికలో వచ్చిన 'లియో'లోను ఆయన పోషించిన పాత్ర ప్రతినాయక ఛాయలున్నదే. ఈ మధ్యే రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'డబుల్ ఇస్మార్ట్' చిత్రంలోనూ 'బిగ్ బుల్'గా ఆయన అదరగొట్టారు. ప్రస్తుతం మారుతి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న హారర్ కామెడీ 'రాజా సాబ్'లోనూ ఆయన నటిస్తున్నారు. ఇందులో ప్రభాస్ జీవితాన్ని మలుపు తిప్పే ఘోస్ట్ పాత్రలో ఆయన కనిపించనున్నారని టాక్. అయితే ఇది పాజిటివా, నెగెటివా అన్నది ప్రస్తుతానికి సస్పెన్స్. ఇక ఇప్పటికే వివేక్ ఒబెరాయ్ 'వినయ విధేయ రామ', 'వివేకం' 'లూసీఫర్'లో.. అర్జున్ రామ్‌పాల్ 'భగవంత్ కేసరి'లో.. అక్షయ్‌కుమార్ '2.0' చిత్రాలలో విలన్ పాత్రలు పోషించిన సంగతి తెలిసిందే.



బాబీ డియోల్

ప్రతినాయకుడి అవతారమెత్తిన మరో బాలీవుడ్ కథానాయకుడు బాబీ డియోల్. ఇప్పటికే 'యానిమల్' సినిమాలో రణబీర్‌తో తలపడ్డారు ఆయన. 'యానిమల్'లో కనిపించింది కాసేపు అయినా.. తన నటనతో ప్రేక్షకులకు విలన్ అంటే వీడేరా అనే ఫీల్‌ను కలిగించారు బాబీ. అయన ప్రస్తుతం దక్షిణాదిలో విలన్‌గా వరుస అవకాశాలను సొంతం చేసుకున్నారు. తమిళ నటుడు సూర్య నటిస్తున్న 'కంగువ'లో భీకరమైన పోరాట యోధుడిగా ఆయన కనిపించనున్నారు. అలాగే, కే.ఎస్.రవీంద్ర దర్శకత్వంలో బాలకృష్ణ హీరోగా నటిస్తున్న 'ఎన్‌బీకే109' చిత్రంలోనూ ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. పవన్‌కల్యాణ్ నటిస్తున్న హిస్టారికల్ యాక్షన్ డ్రామా 'హరిహర వీరమల్లు'లోనూ బాబీడియోల్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ఇందులో ఆయన మొఘల్ ఎంపెరర్ ఔరంగజేబ్ పాత్రను పోషించడం విశేషం. అలాగే విజయ్ నటిస్తున్న నూతన చిత్రంలోనూ ఆయన ప్రతినాయకుడి పాత్రను పోషించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిసింది. హెచ్.వినోద్ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ సినిమా వర్కింగ్ టైటిల్ 'విజయ్ 69'.

గ్రామాల్లో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

- ఘనంగా గణనాథుని ఉత్సవాలు
- ప్రత్యేక పూజలు, హోమాలు
- నిర్విఘ్నంగా సాగిన నిమజ్జనోత్సవాలు

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం

పలాస: జిల్లాలో గణనాథుని ఉత్సవాలు నిర్విఘ్నంగా సాగాయి. గడ చిన తొమ్మిది రోజులుగా గ్రామాల్లో గణనాథుల మండపాల వద్ద ఆధ్యాత్మికత సంత రించుకుంది. గణేశ్ మహరాజ్‌కు విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. రాత్రి సమయంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. సోమవారం చివరిరోజు పలు గ్రామాల్లోని చెరువులు, నదుల్లో గణనాథుని నిమజ్జనోత్స వాలు భక్తిపారవశ్యంతో నిర్వహించారు. పలాస సీతారామాలయం ప్రాంగ ణంలో ఏర్పాటు చేసిన లక్ష్మీగణపతి మండపంలో సోమవారం గణపతి హోమం నిర్వహించారు. లోకశాంతి కోసం నిర్వహించిన ఈ హోమంలో జంట పట్టణాలకు చెందిన పలువురు భక్తులు పాల్గొన్నారు. గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గణపతి హోమం చేపట్టారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేప ట్టారు. కార్యక్రమంలో మందిరం కార్యదర్శి జీజేఎస్ రెడ్డి, మేనేజర్ ఎ.సాంబ మూర్తి తదితరులు పాల్గొన్నారు.


పలాస: గణపతి హోమాన్ని నిర్వహిస్తున్న భక్తులు

పరశురాంపురంలో లడ్డూ రూ.1.05 లక్షలు

టెక్కలి: మండలంలో పలు గ్రామాల్లో ఏర్పాటుచేసిన వినాయక మండ పాల వద్ద లడ్డూలను సోమవారం వేలం నిర్వహించారు. పరశురాంపురంలో ఆవల సంజీవరావు రూ.1.05 లక్షలకు, ధర్మనీలాపురంలో ముంజేటి వెంకట రావు రూ.50,500లకు, టెక్కలి ఎన్టీఆర్ కాలనీలో బమ్మిడి గృహలక్ష్మి రూ. 19, 500లకు గణేశ్ లడ్డూలను వేలం పాటలో కైవసం చేసుకున్నారు. వీరికి ఉత్సవ కమిటీల సభ్యులు సత్కరించారు.

పొందరవీధిలో రూ.50 వేలు..

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి పదో వార్డు పొందర వీధిలో గణేష్ లడ్డూను సోమవారం వేలం వేశారు. ఈ సందర్భంగా అదే వీధి కి చెందిన బల్లు వెంకటరమణ రూ.50,200కు దక్కించుకున్నారు. రాత్రి స్వామిని నిమజ్జనం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేకార్షణగా చిన్నారుల కోలాట ప్రదర్శన

వజ్రపుకొత్తూరు: డోకులపాడులో సోమవారం రాత్రి వినాయక నిమజ్జనం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన ఊరేగింపులో చిన్నారుల కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రీగంగాధర సేవా సంఘం ఆధ్వ ర్యంలో సంప్రదాయ నృత్యాలు, భక్తిగీతాలతో కోలాటం ఆడారు. ఊరేగింపులో సినిమా పాటలు లేకుండా సాంస్కృతిక ప్రదర్శనలు చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వీధి వేషాలు

తులగాం ఆర్‌అండ్‌ఆర్‌కాలని(ఎల్.ఎన్.పేట): కోవిలాం పంచా యతీ తులగాం ఆర్‌అండ్ ఆర్ కాలనీలో ఏర్పాటుచేసిన వినాయక నవరాత్రుల సందర్భంగా సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన వీధి వేషాలు ఆకట్టుకు న్నాయి. సంపత్ వినాయక పూజా కమిటీ ఆధ్వర్యంలో స్వామి నిమజ్జనం సందర్భంగా వీరఘట్టం కళాకారులు వివిధ వేషధారణలు వేసి ఊరేగింపులో పాల్గొన్నారు. గ్రామస్థులు ఈ ప్రదర్శనలను తిలకించి ఆనందం పొందారు.


ఎల్ఎన్‌పేట: వివిధ వేషధారణల్లో కళాకారులు


వజ్రపుకొత్తూరు: ఊరేగింపులో చిన్నారుల కోలాట ప్రదర్శన

నందిగాం: గొల్లూరు, శివరాంపురం, బెజ్జిపల్లి తదితర గ్రామాల్లో సోమ వారం వినాయకుని లడ్డూ వేలం వేశారు. శివరాంపురం లడ్డూను సబ్బి తులసీ రావు రూ.83 వేలకు, గొల్లూరులో సర్పంచ్, టీడీపీ నాయకులు జీరు రాజేశ్వరి నానీరెడ్డి రూ.70 వేలకు, బెజ్జిపల్లిలో తెలగవలస శ్రీరాములు రూ.32 వేలకు లడ్డూను వేలంపాట పాడి దక్కించుకున్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని చెరు వుల్లో వినాయక నిమజ్జనం ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు. కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున స్థానిక ప్రజలు, యువత పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

హిరమండలం: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వినాయక నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సుభలయ ఆర్‌ఆర్ కాలనీలో విద్యార్థులు, యువకులు, మహిళలు ఒకే రకమైన దుస్తులు ధరించి ఊరేగింపు లో పాల్గొన్నారు. సమీపంలోని నది, చెరువుల్లో గణనాథులను నిమజ్జనం చేశారు.


శ్రీకాకుళంలో గణనాథుని ఊరేగింపులో డ్రమ్స్ వాయిస్తున్న చిన్నారులు

ఘనంగా విజయగణపతి శోభాయాత్ర


విజయగణపతికి పుష్పాభిషేకం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలో విజయ గణపతి ఆలయ నిర్వాహ కులు సోమవారం శోభా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ గణ పతికి వివిధ రకాల పుష్పా లతో అభిషేకం చేశారు. అనంతరం ఆలయం నుంచి నాగావళి నది వరకు ఊరేగింపు నిర్వ హించి విగ్రహాన్ని నిమ జ్జనం చేశారు. ఆలయ అర్చకులు పెంట శ్రీధర్ శర్మ, సూర్య నగేష్ శర్మ, ధర్మకర్త వీనస్ హరి, వెంకట్ ఏర్పాట్లను పర్య వేక్షించారు. 300 మంది గణపతి మాలధారులు శోభాయాత్రలో పాల్గొన్నారు. అలాగే నగరం లోని పలు వీధుల్లో ఏర్పాటు చేసిన గణనాథు లను భారీ ఊరేగింపుల మధ్య నాగావళి నదిలో నిమజ్జనం చేశారు.


గణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

వరద సహాయనిధికి మాజీ సైనికులు రూ.1.16 లక్షల విరాళం

పలాస: విజయవాడ వరద సహాయనిధికి పలాస-కాశీబుగ్గ మాజీ సైనికోద్యోగుల సంఘం రూ.1.16 లక్షల విరాళం అందించింది. ఈ మొత్తం చెక్కును కేంద్ర మంత్రి కింజరాపు రామ్మో హన్ నాయుడుకు సంఘం అధ్యక్షుడు ఇళ్ల మన్మథరావు, ఉపాధ్యక్షుడు బంగారు బారికి, ఉప్పా డ వెంకటరావు తదితరులు శ్రీకాకుళంలో సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సంఘం సహాయ కార్యదర్శి బమ్మిడి బాబూరావు, డి.వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.50 వేలు..

నరసన్నపేట: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి నరసన్నపేట మాజీ సర్పంచ్ ఊణ్న రాజేశ్వరి, వేంకటేశ్వరావు కుటుంబ సభ్యులు రూ.50 వేల ను అందించారు. ఈ మేరకు సోమవారం ఆ చెక్కును రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నా యుడికి విశాఖపట్నంలో అంద జేశారు. ఈ సందర్భంగా మంత్రి వారిని అభినందించారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎమ్మెల్యే ఎంజీఆర్

పాతపట్నం: కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సోమవారం శ్రీకాకుళంలోని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆసియా పసిఫిక్ సభ్య దేశాల ఛైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా ఆయన కు బొకే ఇచ్చి అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో దేశ గౌరవాన్ని ఇనుమడింపజేశారని కొనియాడారు.

నిస్వార్థ సేవలకు గుర్తింపు: ఎమ్మెల్సీ చిరంజీవిరావు


డీఎస్సీ స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు

పాతపట్నం: నిస్వార్థ సేవలకు గుర్తింపు ఉంటుం దని ఎమ్మెల్సీ వేపాడ చిరం జీవిరావు అన్నారు. స్థానిక మహేంద్ర జూనియర్ కళా శాలలో నిర్వహించిన ఎంజీ ఆర్ మెగా డీఎస్సీ శిక్షణ కేం ద్రంలో శిక్షణ పొందిన అభ్యర్థులకు సోమవారం స్టడీ మెటీరియల్‌ను ఉచి తంగా అందించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడు తూ.. యువతను ఉన్నతులుగా చేసేందుకు ఎమ్మెల్యే గోవిందరావు చేస్తున్న సేవలు అభినంద నీయమన్నారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ.. ప్రజా ప్రయోజనాలే తన ప్రథ మ కర్తవ్యమన్నారు. నిరుద్యోగులకు బాసటగా నిలిచేందు కు నిర్వహిస్తున్న కార్యక్రమాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఈవో డా.ఎస్.తిరుమలచైతన్య, లావేరు ఎంపీడీవో విశ్వేశ్వరరావు, పలువురు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అండగా కూటమి ప్రభుత్వం


ప్రేమ్‌కుమార్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే బగ్గు

నరసన్నపేట: క్రీడాకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉం టుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూ ర్తి అన్నారు. ఈజిప్టులో జరగనున్న స్విమ్మింగ్ ట్రైథాలన్ అండర్ -17 వి భాగంలో రాష్ట్రం నుంచి ఎంపికైన జ మ్ము గ్రామానికి చెందిన టెంక ప్రే మ్‌కుమార్‌ను సోమవారం అభినం దించారు. ఈజిప్టులో జరిగే పోటీ లకు ప్రేమ్‌కుమార్ వెళ్లేందుకు కావాల్సిన సాయాన్ని ప్రభుత్వం నుంచి అందించడం జరుగుతుందన్నారు. అంతర్జాతీయ స్థా యిలో ప్రతిభ కనబరచాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బలగ ప్రహర్ష, దుంగ సింహాచలం, రెడ్డి సతీష్ తదితరలు పాల్గొన్నారు.

ఖాళీ ప్రదేశాల్లో నీటి నిల్వతో ఇబ్బందులు

- బోర్లు పాడవుతున్నాయని కాలనీవాసుల ఆందోళన


పునాదుల్లో నిల్వ ఉండిపోయిన వర్షం నీరు

పలాస: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు స్థానిక అన్నపూర్ణ ఆశ్రమం కాలనీలో ఖాళీ ప్రదేశాల్లో నీరు నిలిచిపోయింది. దీంతో కాలనీలోని బోర్లలో నీరు కలుషితమవుతోందని స్థాని కులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో వంద ఇళ్లకు పైగా ఉన్నాయి. పొంట పొలాలు, పునాదు ల్లో చేరిన నీరు ఎటూ వెళ్లకపోవడంతో నిల్వ ఉండి దోమలు ఉత్పత్తి అవుతున్నాయి. దీంతో అనారోగ్యం పాలవడంతో పాటు బోరు నీరు కూడా కలుషితమై బురదగా వస్తోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మునిసిపల్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

నందిగాం: నందిగాం గురుకుల పాఠశాల సమీపంలో హైవేపై సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ ఆదేశాల మేరకు సిబ్బంది రోడ్డు నిబంధనలు పాటించని, పత్రాలు లేని వాహనాలను తనిఖీ చేసి అపరాధ రుసుం విధించారు. రోడ్డు భద్ర తా నిబంధనలను పాటించాలని, ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించాలని, అన్నిరకాల ధ్రువీకరణ పత్రాలు దగ్గర ఉంచుకోవాలని, త్రిపుల్ రైడింగ్ చేయవద్దని సూచించారు.

మొక్కలతోనే భవిష్యత్

హరిపురం: మొక్కలతోనే భావితరాలకు భవిష్యత్ అందించవచ్చని గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ అన్నారు. రట్టి గ్రామంలో మొక్కల నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక యువజన సంఘ సభ్యులతో సోమవారం రోడ్డుకు ఇరువైపులా, తీర ప్రాంతంతో పాటు రట్టి వల్లభనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో మొక్కలను నాటించారు. వీటిని సంరక్షించే చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సింహాద్రి, యువజన సంఘ సభ్యులు రట్టి వైకుంఠరావు, ఈశ్వరరావు, రమేష్, శ్యామసుందరరావు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు చర్యలు

- నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- అడిషనల్ డీఎంహెచ్‌వో డా.శ్రీకాంత్

జలుమూరు: నులిపురుగుల నివారణకు సంబంధించి మాత్రలను ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు వారికి పంపిణీకి చర్యలు తీసుకున్నామని అడిషనల్ డీఎంహెచ్‌వో డా.తాడేల శ్రీకాంత్ తెలిపారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీని సంద ర్శించి వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ.. జాతీయ నులిపురుగుల నివారణలో భాగంగా మంగళవారం అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వేయించ నున్నా మన్నారు. జలుమూరు పీహెచ్‌సీ పరిధిలో 5,886 మంది పిల్లలకు ఈ మాత్రలను సిబ్బంది వేయ నున్నా రన్నారు. మధ్యాహ్నం భోజనం తరువాత హెచ్‌ఎంలు, ఉపా ధ్యాయుల ఆధ్వర్యంలో పిల్లలతో మాత్రలు నమిలి మింగించా లని వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలకు సూచిం చారు. కార్యక్రమంలో వైద్యాధికారి చల్ల వంశీకృష్ణ, సీహెచ్‌వో పద్మావతి, ఆరోగ్య విస్తరణాధికారి చిన్నరాజులు, హెల్త్ అసి స్టెంట్ చిన్నారావు పాల్గొన్నారు.

నేడు నులిపురుగుల నివారణ దినం

పోలాకి: జాతీయ నులిపురుగుల నివారణ దినాన్ని మంగ ళవారం నిర్వహించనున్నట్లు పోలాకి పీహెచ్‌సీ వైద్యుడు శ్రీ నాథ్, ఆరోగ్య విస్తరణాధికారి నల్లి రవికుమార్ తెలి పారు. ఈ మేరకు అవగాహనకు గాను పీహెచ్‌సీ నుంచి సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. మంగళవారం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండ జోల్ మాత్రలను పిల్లలతో మింగించనున్నామన్నారు. ఇంకా మిగిలిపోయిన వారికి 25న ఇవ్వనున్నామన్నారు. ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



ధర్నా చేస్తున్న వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం ప్రతినిధులు

కాశీబుగ్గ: ఎన్నికలకు ముందు బీజేపీ, టీడీపీ, జన సేన పార్టీలు అనేక హామీలు ఇచ్చాయని, కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వా లు ఏర్పాటైనందున ఆ హామీ లను అమలు చేయాలని అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం ప్రతినిధులు కోరారు. వీటి అమలును కోరు తూ అక్టోబరు ఒకటి వరకు మండల కేంద్రాల్లో నిర్వహించనున్న ధర్నాలను విజయ వంతం చేయాలని కోరారు. ఈ మేరకు సోమవారం కాశీబుగ్గ బస్టాప్ ఆవరణలో సంఘం పిలుపు మేరకు ధర్నా నిర్వహిం చారు. ఆయా పార్టీలు ఎన్నికల హామీ ల్లో భాగంగా యువత కు ఉద్యోగాలు, లబ్ధిదారులకు పక్కా ఇళ్లు ఇస్తామని వాగ్దానం చేశాయని, రైతుకు మద్దతు ధర చట్టబద్ధం చేస్తామని హామీ ఇచ్చాయన్నారు. అయితే ప్రభుత్వాలు ఏర్పడినప్పటికీ నేటికీ వాటిని అమలు చేయలేదన్నారు. ఉపాధి జాబ్ కార్డులు, రైతులకు గుర్తింపు కార్డులివ్వాలని, సాగు భూములకు పట్టా లివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘ నేతలు సన్యాసిరావు, దుష్యంత్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీలు

- జాతీయ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు హైస్కూల్ ఆవరణలో గత మూడురోజులుగా జరుగుతున్న 36వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ టెన్నీకాయిట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. 11 ఉమ్మడి జిల్లాల నుంచి బాలబాలికలు ఈ పోటీల్లో ఉత్సా హంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. సోమ వారం సెమీఫైనల్, ఫైనల్ పోటీల్లో క్రీడాకారులు పోటీపడ్డారు.

విజేతలు వీరే..

బాలుర విభాగంలో ఎస్.గౌతం, కేఎస్ఎస్ ప్రసాద్, బి.సత్య నారాయణ (తూర్పుగోదావరి), ఎస్. సాయికుమార్ (విజయ నగరం), జి.మహేంద్ర (అనంత పురం), డి.రోహిత్ (విశాఖ పట్నం) విజేత లుగా నిలిచారు. బాలికల విభాగంలో కె.జ్యోతి, దీక్షిత్, స్పందన (అనంతపురం), సంస్కృతి (పశ్చిమ గోదా వరి), కె.ఇందు (విజయనగరం), బి.గాయత్రి (చిత్తూరు) విజేత లుగా నిలిచినట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్‌వీ సత్యనారాయణ, నిర్వాహక పీఈటీ పిగజేంద్రరావు తెలిపారు. వీరంతా ఈ నెల 30 నుంచి అక్టోబరు 4వ తేదీ వరకు జమ్ములో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విజేతలకు జ్ఞాపికలతో పాటు ప్రశంసాపత్రాలను నిర్వాహకులు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సూరాడ మోహనరావు, అర్జవెల్లి ఉమామహేశ్వరరావు, నెయ్యి ల సూర్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు తవి టయ్య, గజేంద్ర, హెచ్.తారకేశ్వర పండా తదితరులు పాల్గొన్నారు.


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు, నాయకులు

అంతిమ యాత్రలో తప్పని అవస్థలు

జలుమూరు: తలతరియా పంచాయతీ లింగాలపాడు గ్రామానికి చెందిన ఎ స్సీ కులస్థులకు అంతిమ యాత్ర కష్టాలు తప్పడం లేదు. శ్మశాన వాటికకు సరైన రోడ్డు లేకపోవడంతో కాలనీలు ఎవరైనా మృతి చెందితే ఇలా పొలం గట్లపై నుంచి తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. కాలనీకి సుమారు అర కిలోమీటరు దూరం లో ఉన్న శ్మశానానికి రోడ్డు వేయాలని అనేక పర్యాయాలు అధి కారులను కోరినా పట్టించుకోవడం లేదన్న ఆవేదన స్థానికుల్లో వ్యక్తమవుతోంది. గ్రామానికి మూడు శ్మశానాలు ఉన్నప్పటికీ ఎస్సీలు వినియోగిస్తున్న శ్మశాన వాటికకు మాత్రమే రహ దారి లేదని వారు వాపోయారు. పొలాల్లో పంటలు ఉండే సమయంలో, వర్షాకాలం లోనూ మృతదేహాలను తీసుకు నేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నా యని ఆవే దన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్క రించాలని స్థానికులు కోరుతున్నారు.


పొలంలో నుంచి మృతదేహాన్ని మోసుకువెళుతున్న కాలనీవాసులు

అవయవదాత కుటుంబానికి సాయం

టెక్కలి: టెక్కలిలో ప్రైవేట్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ విద్యుత్ స్తంభంపై నుంచి జారిపడి బ్రెయిన్‌డెడ్ అయిన బొమ్మాళి బాలరాజు అవయ వాలను కుటుంబ సభ్యులు దానం చేసిన సంగతి తెలి సిందే. ఈ నేపథ్యంలో అతని కుటుంబానికి యాదవ పసుపుదళం సభ్యులు సోమవారం రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కన్వీనర్ ఇప్పిలి జగదీష్, సబ్బి జానకిరాం, బొల్ల సింహాచలం, ఆవల సంతోష్, అప్పన్న, నర్తు కృష్ణ, కోనారి శ్రీను పాల్గొన్నారు.


బాలరాజు కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న యాదవ పసుపుదళం సభ్యులు

కొండచిలువ హతం



వజ్రపుకొత్తూరు: పెద్దబడాం పంటపొలాల్లో కొండ చిలువ ఉన్న విషయం గుర్తించిన స్థానికులు దానిని హతమార్చారు. పెద్దబొడ్డపాడు, సీతాపురం గ్రామాలకు సమీపంలోని పంట పొలాల్లో సుమా రు 10 అడుగుల పొడవున్న కొండచిలువ సంచరిస్తున్నట్లు రైతులు గుర్తించి గ్రామస్థులకు సమా చారం అందించారు. వెంటనే వారంతా అప్రమత్తమై కర్రలతో దానిని హతమార్చారు. సమీపంలో కొండలు ఉండడంతో తరచూ కొండ చిలువలు, విష జంతువులు వచ్చి పంటలను నాశనం చేస్తు న్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తంచేశారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

టెక్కలి: టెక్కలి కోదండరామ వీధికి చెందిన సాయి అనే బాలుడిపై ఆదివారం రాత్రి కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు బాలుడి ని జిల్లా కేంద్ర ఆసు పత్రికి తరలించి వైద్యసేవలు అందిం చారు. టెక్కలిలో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ పిల్లలపై దాడులు చేస్తున్నాయని, వాటిని నియంత్రించాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

శాఖా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలి

ఎల్.ఎన్.పేట: ఎల్.ఎన్.పేట మండల కేంద్రంలో శాఖా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని ఠాగూర్ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు పి.వెంకటరావు కోరారు. ఈ మేరకు సోమవారం కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కలిసి వినతిపత్రం అందించారు. మండలంలో గ్రంథాలయం లేకపోవడంతో 22 పంచాయతీల్లోని నిరుద్యోగ యువ తీ, యువకులు పోటీ పరీక్షల కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే ఎల్ఎన్‌పేట మండలం గతంలో శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌లో ఉండేదని, ప్రస్తుతం టెక్కలి డివిజన్‌లో కలపడం వల్ల వివిధ పనుల నిమిత్తం టెక్కలికి వెళ్లేందుకు సరైన అవకాశాలు లేక ఇబ్బం దులు తలెత్తుతున్నాయని, తగు చర్యలు తీసుకుని సమస్య లను పరిష్కరించాలని కోరారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించారని వెంకటరావు పేర్కొ న్నారు.

జారుతున్న మట్టితో ఇబ్బందులు


రోడ్డుపైకి జారిన మట్టి

పలాసరూరల్: కేదారిపురం నుంచి గంగువాడకు వెళ్లే మార్గంలో కొండలపై నుంచి ఇటీవల వర్షాల ధాటికి మట్టి జారుతూ రోడ్డుపైకి రావడంతో వాహనాలు పల్టీ కొడుతున్నా యని పలువురు వాహన చోదకులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఆటోలు, బైక్‌లు ఈ మట్టిపైకి వచ్చి స్లిప్ అవుతున్నాయని వాపోతున్నారు. ఈ రోడ్డుపైకి కొండల మట్టి కిందకు జారకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సి ఉన్నప్పటికీ అటువంటి చర్యలు లేకపోవడంతో వాహన దారుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొండల నుంచి వర్షాలకు జారిన మట్టిని తొలగించి ప్రమా దాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో ఈద్ మిలాద్ ఉన్ నబీ

టెక్కలి: మహ్మద్ ప్రవక్త పుట్టినరోజు సందర్భంగా స్థాని క జామియా మసీదులో ము స్లింలు సోమవారం భక్తిశ్రద్ధల తో ఈద్ మిలాద్ ఉన్ నబీ నిర్వహించారు. నమాజ్ చేశా రు. కార్యక్రమం లో జామియా మసీదు పెద్ద సయ్యద్ అలీ, షరీఫ్, మహ్మద్ అలీ, జిలాల్, షేక్‌బషీర్, షేక్ సాదీర్ తది తరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


నాగరాజు (ఫైల్)

నరసన్నపేట: ఆర్థిక సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నరసన్నపేటలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నరసన్నపేట పట్టణం కలివరపుపేట వీధికి చెందిన వైశ్యరాజు నాగరాజు (32) తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతడు కొన్నేళ్లుగా ఒక వ్యక్తి వద్ద ఫైనాన్షియల్ కలెక్షన్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ మేరకు నాగరాజు తండ్రి లక్ష్మణరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మెళియాపుట్టి: సంతలక్ష్మీపురానికి చెందిన ఉంగ ధనలక్ష్మి (28) ఆత్మహత్యాయత్నానికి పాల్పడి శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 14న భార్యాభర్తల మధ్య జరిగిన తగాదా నేపథ్యంలో ధనలక్ష్మి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి కరజాడ పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి పలాస సీహెచ్‌సీకి తరలించికి, పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య సేవలు పొందుతూ సోమవారం మృతి చెందింది. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. పాతపట్నం సీఐ నల్లి సాయి గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు..


సింహాద్రి (ఫైల్)

మెళియాపుట్టి: పెద్దలక్ష్మీపురం గ్రామానికి చెందిన మడపాల సింహాద్రి(35) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ సమీపంలో ట్రాక్ పక్కన సింహాద్రి మృతదేహం పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడి చేరుకున్న రైల్వే పోలీసులు సింహాద్రి వద్ద దొరికిన ఆధారాల మేరకు మెళియాపుట్టి మండలం పెద్దలక్ష్మీపురం గ్రామానికి చెందిన మడపాల లక్ష్మీనారాయణ కుమారుడిగా గుర్తించారు. దీంతో ఆ గ్రామస్థుల ద్వారా హైదరాబాదులో ఉంటున్న లక్ష్మీనారాయణకు సింహాద్రి మృతి చెందిన విషయాన్ని అందించారు. కాగా సింహాద్రి ఇచ్ఛాపురంలోనే ఉంటూ పెయింటింగ్ పనులు చేసుకుంటున్నాడు. అయితే సింహాద్రి మృతికి గత కారణాలు తెలియాయల్సి ఉంది.

ఇసుక ట్రాక్టర్ సీజ్


పట్టుబడ్డ ఇసుక ట్రాక్టర్ వద్ద పోలీసులు

ఇచ్ఛాపురం: లొద్దపుట్టి గ్రామం సమీపంలో బాహుదా నది వంతెన అండర్ పాసేజ్ వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి ఇసుకను లోడ్ చేస్తుండగా పట్టుకున్నట్టు తెలిపారు. దీంతో నాగం కృష్ణబాబు, శ్రీనివాసరెడ్డిపై కేసు నమోదు చేశామని తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

కొర్రాయిగేటు వద్ద లారీ..

హరిపురం: మందస మండలం కొర్రాయిగేటు వద్ద సోమవారం తనిఖీ చేస్తుండగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు ఎస్ఐ ఖాదర్‌బాషా తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా అనుమతి పత్రాలు లేని లారీని పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఒడిశా రాష్ట్రం కటక్ నుంచి పలాసకు ఇసుక తరలిస్తుండగా పట్టుకుని మందస స్టేషన్‌కు తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

పశువులను రవాణా చేస్తున్న లారీ పట్టివేత

నరసన్నపేట: బరంపురం నుంచి విశాఖపట్నానికి పశువులను అక్రమంగా తరలిస్తున్న లారీని మడపాం టోల్‌గేట్ వద్ద సోమవారం పోలీసులు పట్టుకున్నారు. 34 గేదెలను కబేళాకు తరలిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీ చేసి లారీని పట్టుకుని సీజ్ చేశామని ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న గేదెలను విజయనగరం జిల్లా కొత్తవలస గోశాలకు తరలించామని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గుంతలో దిగబడిన లారీ


రోడ్డు మధ్యలోని గుంతలో ఇరుక్కున్న లారీ

సరుబుజ్జిలి: జిల్లా కేంద్రం నుంచి ఒడిశా రాష్ట్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే అలికాం-బత్తిలి ప్రధాన రహదారి ఏర్పడిన గుంతలో వాహనం దిగితే వాహనచోదకుల గుండెజారుతుంది. సోమవారం ఒడిశా రాష్ట్రం నుంచి విశాఖ వైపు ఇసుక లోడుతో వెళ్తున్న ఓ లారీ సరుబుజ్జిలి బంకు సమీపంలో ఉన్న గుంతలో దిగబడింది. ఇక్కడ ఉన్న కల్వర్టు కుంగిపోవడంతో కొండ ఎగువ భాగం నుంచి వచ్చే వరదనీరంతా రోడ్డుపైనే ప్రవహిస్తుంది. దీంతో గత కొంతకాలం నుంచి భారీ గుంతలు ఏర్పడి నిత్యం నీటితో నిండి ఉంటున్నాయి. వాహన డ్రైవర్లు ఎంత చాకచక్యంగా తప్పించుకునేదుకు ప్రయత్నించినా ఏదో ఒక గుంతలో వాహనాలు ఇరుక్కుపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలా ప్రతి రోజూ ఏదో ఒక వాహనం దిగబడిపోతున్నా సంబంధిత అధికారులు ఇక్కడ మాత్రం శాశ్వత పరిష్కారం చూపడం లేదు. ఇప్పటికైనా స్పందించి పూర్తిస్థాయిలో పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆరు అడుగుల అగర్‌బత్తితో ధూపం


వినాయక విగ్రహం వద్ద వెలిగించిన ఆరు అడుగుల అగర్‌బత్తి

ఇచ్ఛాపురం: పట్టణ పరిధి ఆసుపత్రి రోడ్‌లో 18.5 అడుగుల భారీ వినాయక మండపాన్ని కమిటీ సభ్యులు ఏర్పాటు చేసి వినాయక చవితి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సైకిల్ బ్రాండ్, మైసూర్ వారు ఆరు అడుగుల అగర్‌బత్తిని స్థానిక బెస్ట్‌మార్ట్ డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌కి అప్పగించారు. ఆ అగర్‌బత్తిని వారు కమిటీ సభ్యులుకు సోమవారం అందజేసి వెలిగించారు. వినాయకుడితో పాటు అగర్‌బత్తిని చూసేందుకు భక్తులు ఆసక్తి చూపారు.

కులరహిత సమాజమే లక్ష్యం కావాలి

అరసవల్లి: కులరహిత సమాజమే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని జిల్లా సామాజిక సమరసత వేదిక వక్తలు అన్నారు. సోమవారం స్థానిక సాయిబులతోటలో గల సంస్థ వేదిక వద్ద మోక్షానికి అర్హత కులమా? గుణమా? అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. మనిషికి నిజమైన గుర్తింపు, గౌరవాన్నిచ్చేది గుణమేనని, నేటి సమాజంలో కులాలు, మతాలు పేరిట విభేదాలు అధికమై సామాజిక బాధ్యత వెనుకబడిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వేదిక జిల్లా అధ్యక్షుడు ముని శ్రీనివాసరావు, బోను దుర్గాప్రసాద్, జంధ్యాల శరత్‌బాబు, భమిడిపాటి గౌరీశంకర్, వేణుగోపాల్, శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

18 కిలోల గంజాయి పట్టివేత

- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ శ్రీనివాసరావు


విలేఖరులతో మాట్లాడుతున్న ఏఎస్పీ శ్రీనివాసరావు

కంచిలి, సెప్టెంబరు 16: ఒడిశా రాష్ట్రం కోదల రాంపల్లి నుంచి ముంబాయికి తరలిస్తున్న సుమారు 18 కిలోల గంజాయిని కంచిలి పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఏఎస్పీ పి.శ్రీనివాసరావు విలేకరులకు వెల్లడించారు. ఏఎస్పీ చెప్పిన వివరాల మేరకు.. కోదల రాంపల్లి గ్రామానికి చెందిన సంజయ్ పొలాట, సాగర్ పొలాట ముంబాయిలోని ముఖేష్ అనే వ్యక్తితో గంజాయి వ్యాపారం సాగిస్తున్నారు. 18 కిలోల గంజాయిని సంతోష్ కుమార్ సాహు అనే వ్యక్తికి ఇచ్చి ముంబాయిలోని ముఖేష్‌కు అప్పగించేందుకు ఏర్పాటు చేసుకున్నారు. గంజాయి ఉన్న ఒక సూట్‌కేస్, ఒక బ్యాగ్‌తో సంతోష్‌కుమార్ సాహు సోంపేట రైల్వేస్టేషన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో గస్తీకి వచ్చిన ఎస్ఐ రాజేష్, సిబ్బంది అతడిని తనిఖీ చేయగా.. అతడి వద్ద 18.190 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకోవడంతోపాటు సంతోష్‌కుమార్ సాహును అదుపులోకి తీసుకున్నారు. పిల్లలు చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని ఏఎస్పీ అన్నారు. మాదక ద్రవ్యాల వ్యాపారం, రవాణాలపై సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కాగా గంజాయిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ రాజేష్‌తో పాటు సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు. సోంపేట సీఐ బి.మంగరాజు ఉన్నారు.


గంజాయితో ఉన్న బ్యాగ్, సూట్ కేస్

ఘనంగా మిలాద్ ఉన్ నబి


ఇచ్ఛాపురం: బస్టాండ్ వద్ద ర్యాలీగా ముస్లింలు

ఇచ్ఛాపురం: ముస్లింలు మిలాద్ ఉన్ నబి సోమవారం ఘనంగా జరుపుకున్నారు. మహ్మద్ ప్రవక్తా జన్మదినం సందర్భంగా కస్పావీదిలో గల షాదీఖానా, లాలాపేటలో గల దర్గా వద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జామియా మసీద్ అధ్యక్షుడు ఎండీ అహ్మద్ ఆలీ, ఇమామ అనీష్ కదరి, ఫరిరుద్దీన్, రఫీ, టీడీపీ జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షుడు జిలానీ తదితరులు పాల్గొన్నారు. కస్పావీదిలో ముస్లిం జమాత్ సంఘ సభ్యులు మిలాద్ ఉన్ నబీ ఉత్సాహంగా జరిపారు. మతపెద్దలు హెచ్ఎం అబ్దుల్లా, హుస్సేన్ షరీఫ్, ఫరీద్‌ఖాన్, జాకీర్‌షరీఫ్, జోహర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


ఆమదాలవలస: నమాజ్ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

పండగలు మతసామరస్యానికి ప్రతీక

ఆమదాలవలస: హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు తదితర మతాలకు చెందినవారికే జరుపుకొని పండగలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని సూరాన్ మసీదులో నిర్వహించిన మిలాద్ ఉన్ నబీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రార్థనలు చేశారు. ముస్లింల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర న్యాయ విభాగ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్, నాయకులు జీడి ప్రసాద్, నాగళ్ల మురళీధర్ యాదవ్, ముస్లిం పెద్దలు జిలానీ మాలిక్, అబ్బు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ఆస్తులకు నష్టం కలిగిస్తే సహించేది లేదు

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి కృష్ణారావు


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు కృష్ణారావు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంపై అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి కృష్ణారావు తెలిపారు. పార్టీ ఆస్తులకు ఎవరైనా నష్టం కలిగిస్తే సహించేది లేదని స్పష్టంచేశారు. సోమవారం శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యాచరణ చేపడుతున్నట్లు తెలిపారు. త్వరలో మండల, గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేసి ప్రజా వ్యతిరేక విధానాలు, సమస్యలపై పోరాటం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కేఎల్‌వీఎస్ ఈశ్వరి, పట్టణ అధ్యక్షుడు ఆర్.సురేష్, అంబటి దాలినాయుడు, రవికుమార్ పాల్గొన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి


కూతకు వెళ్లి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

పొందూరు: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, క్రీడా స్ఫూర్తినే కాకుండా స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కబడ్డీ యూత్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. తెలుగుదేశం ప్రభుత్వం క్రీడలకు, క్రీడాకారులకు ప్రాధాన్యతనిస్తుందని, బడ్జెట్‌లో క్రీడలకు అధిక నిధులు తెలుగుదేశం ప్రభుత్వంలోనే కేటాయించబడతాయన్నారు. నిర్వాహకులు క్రీడాకారులను రవికుమార్‌కు పరిచయం చేశారు. మొదటి కూతకు వెళ్లి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎ.రాము, బలగ శంకరభాస్కర్, అనకాపల్లి చినరంగ, బాడాన గిరి, అనకాపల్లి విజయలక్ష్మి, కె.శాంతారాం, కె.శ్రీనివాసరావు తదిత రులు పాల్గొన్నారు. కబడ్డీ పోటీల్లో మొదటి బహుమతిగా రూ.15 వేలు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినవారికి రూ.10 వేలు, రూ.7 వేలు చొప్పున టీడీపీ నాయకులు అందిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

కూర్మనాథుని సన్నిధిలో కలెక్టర్ దంపతులు


కలెక్టర్ దంపతులకు ఆశీర్వదిస్తున్న వేదపండితులు

గార: శ్రీకూర్మంలోని కూర్మనాథ స్వామివారిని సోమవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ దంపతులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి వేదపండితులు ఆశీర్వచనం చేశారు. స్వామి వారి ప్రసాదాన్ని, చిత్ర పటాన్ని ఆలయ ప్రధాన అర్చకులు సీతారామ నరసింహా చార్యులు, ఉద్యోగి నర్సుబాబు వారికి అందచేశారు. ఆలయ విశిష్టతను ప్రధాన అర్చకులు సీతారామ నరసింహాచార్యులు వివరించారు.

మాజీ సైనికుల సేవలు స్ఫూర్తిదాయకం

- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు


కేంద్రమంత్రిని కలిసిన మాజీ సైనికోద్యోగులు

అరసవల్లి: సైనికుడిగా దేశ సేవలో ఉన్నా, విరమణ అనంతరం సమాజ సేవలో ఉన్నా.. మాజీ సైనికుల సేవలు స్ఫూర్తిదాయకమని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కొనియాడారు. జిల్లాకు చెందిన 16 మండల మాజీ సైనికోద్యోగ సంఘాల ప్రతినిధులు ఆయన్ని కలిసి విజయవాడ వరద బాధితుల సాయంగా సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.5,00,116 చెక్కును కేంద్రమంత్రికి ఆయన నివాసంలో సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సంఘ చైర్మన్ పి.ఈశ్వరరావు, అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు, సభ్యులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ నిరసన


నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

గుజరాతీపేట: అమెరికా పర్యటనలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ.. భారతదేశంలో రిజర్వేషన్లు తీసేయాలంటూ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గొలివి కరుణాకరరావు మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ బాధ్యతారహితంగా మాట్లాడడం విచారకరమన్నారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ చిత్రపటానికి చెప్పులతో కొట్టి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు, నాయకులు పూడి తిరుపతిరావు, అట్టాడ రవిబాబ్జీ, చల్లా వెంకటేశ్వరరావు, సురేష్‌సింగ్ బాబు, సీహెచ్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉత్పత్తులు ఏడీసీలో నమోదు చేయాలి

ఆమదాలవలస: మహిళా సంఘాలు తమ ఉత్పత్తులన్నింటినీ మార్కెటింగ్ చేసుకోవడానికి ప్రభుత్వం కొత్తగా ఆన్‌లైన్ డిజిటల్ కామర్స్ (ఏడీసీ)లో నమోదు చేయించుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. సోమవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడారు. మహిళా సంఘ సభ్యులు తమ సొంత నిధులను పూర్తిగా వినియోగించుకొని మండల సమాఖ్య, గ్రామ సంఘాల ద్వారా మహిళా కుటుంబాలు ఏర్పాటు చేసుకుంటున్న చిన్న, మధ్య తరగతి, కుటీర పరిశ్రమలకు అవసరం మేరకు స్త్రీనిధి రుణాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల సమన్వయకర్త రామప్పడు, ఆన్‌లైన్ డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, వీవోఏలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులపై వేధింపులు ఆపాలి

అరసవల్లి: మధ్యాహ్న భోజన కార్మికులపై వేధింపులు ఆపాలని, వచ్చే నెల 2న విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి, కార్యదర్శి ఉత్తర కోరారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ.. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికులపై వేధింపులు, తొలగింపులు పెరిగాయని, గత వైసీపీ ప్రభుత్వం మాదిరిగానే కార్మికులపై వేధింపులకు పాల్పడడం సరికాదన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు సీతమ్మ, వి.లక్ష్మి, గీతాబాల, రాజులమ్మ, కౌసల్య, తులసి, తులసమ్మ, కన్యాకుమారి, పార్వతి, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

నీట్ పీజీలో మెరిసిన జిల్లా విద్యార్థులు

- ర్యాంకులు సాధించిన వారికి అభినందనలు

నేషనల్ ఎలిజిబులిటీ ఎంట్రెన్స్ టెస్ట్-2024 పీజీ(నీట్) ఫలితాల్లో జిల్లా విద్యార్థులు మెరిశారు. సోమవారం విడుదలచేసిన ఫలితాల్లో వివిధ కేటగిరీల్లో మెరుగైన ర్యాంకులు సాధించిన విద్యార్థులను పలువురు అభినందించారు.

దిమిలాడ విద్యార్థికి 316వ ర్యాంకు


తల్లిదండ్రులతో సాయికిరణ్

నందిగాం: మండలంలోని దిమిలాడకు చెందిన దుపూరు సాయికిరణ్ నీట్ పీజీలో సాయికిరణ్ రాష్ట్ర స్థాయిలో 316వ ర్యాంకు సాధించాడు. ఆల్‌ఇండియా ఓబీసీ కేటగిరిలో 96.934 మార్కులతో 6,674వ ర్యాంకు సాధించాడు. విజయనగరం మిమ్స్‌లో ఎంబీబీఎస్ పూర్తిచేశాడు. సాయికిరణ్ తండ్రి ఎస్‌వీ రమణమూర్తి భావనపాడు మెరైన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. సాయికిరణ్‌ను గ్రామస్థులు అభినందించారు.

కౌశిక్‌కు 544..

సోంపేట: సోంపేటకు చెందిన సనపల కౌశిక్ రాష్ట్రస్థాయిలో 544వ ర్యాంకు సాధించాడు. న్యాయవాది సనపల రామారావు కుమారుడు కౌశిక్ సత్తాచాటడంతో కుటుంబసభ్యులు, స్నేహితులు అభినందించారు.


సనపల కౌశిక్

ఇచ్ఛాపురం విద్యార్థులు..

ఇచ్ఛాపురం: మండలంలోని ఈదుపురానికి చెందిన ఆశి ప్రవీణ రెడ్డి, ఉప్పాడ అవినాష్ నీట్ నీట్ పీజీ ఫలితాల్లో ప్రతిభ కనబరి చారు. ప్రవీణరెడ్డికి ఓబీసీ కేటగిరిలో 720 మార్కులకు గానూ 664మార్కులు సాధించి ఆల్‌ఇండియా స్థాయిలో 19,979 ర్యాంక్, స్టేట్‌లో 8,876 ర్యాంక్ సాధించాడు. అవినాష్‌కు ఆల్‌ఇండియా ర్యాంక్ 65,650 ర్యాంకు సాధించడు. ప్రవీణ్‌రెడ్డి, అవినాష్‌లకు సర్పంచ్ నర్సుప్రసాద్, ఎస్.శంకర్‌రావు, ప్రేమలత, బేతాళ యువజన సంఘం సభ్యులు అభినందించారు.


ప్రవీణరెడ్డి


అవినాష్

రేపటి నుంచి క్రీడా పోటీలు

గార: మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు ఈ నెల 18వ తేదీన నిర్వహించనున్నట్టు ఎంఈవోలు నక్క రామకృష్ణ, వినోదిని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ బ్యాడ్మింటన్, టెన్నీకాయిట్ పోటీలు బాలికలకు వమరవెల్లి బాలికల గురుకుల పాఠశాలలో, బాలురకు సతివాడ జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఈ-పంట నమోదుకు గడువు పెంపు

ఇచ్ఛాపురం: ఖరీఫ్ పంటలకు ఈ-పంట నమోదు చేయడానికి గడువు పెంచడం జరిగిందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం, చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారిణి భార్గవి ప్రకటనలో తెలిపారు. ఈ-పంట నమోదుకు ఈ నెల 15వరకు మాత్రమే గడువు ఉండగా తాజాగా ఆ గడువును ఈ నెల 23 వరకు పొడిగించడం జరిగిందన్నారు. పంట నమోదు, ఈకేవైసీ రైతులు తమ గ్రామంలో ఉన్న రైతు కేంద్రాలకు వెళ్లి నమోదు చేయించుకోవాలన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల చేతివాటంపై చర్చ

ఆమదాలవలస: మండలంలో 2023-24 సంవత్సరానికి ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించిన పనుల నిధులు సామాజిక తనిఖీ బృందం ఎదుట గ్రామాల్లో వాదోపవాదాలు చోటు చేసుకుంటున్నాయి. మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీ బృందం సభ్యులు ఉపాధి నిధులు చెల్లింపులపై ఇటీవల తనిఖీ నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహిస్తున్నారు. సోమవారం మండలంలోని కొత్తవలస, గాజులుకొల్లివలస గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఉపాధ హామీ క్షేత్ర సహాయకుల అవినీతిపై కూలీలు ఆరోపణలు చేశారు. దీంతో గ్రామసభల ప్రాంతంలో ఇరువర్గాల వాదోపవాదాలు చేసుకోవడంతో కొంత గందరగోళ పరిస్థితి ఏర్పడింది. కొత్తవలస గ్రామసభలో 2021లో చెనిపోయిన వ్యక్తికి ఇప్పటికీ ఉపాధి పనికి హాజరవుతున్నట్టు మాస్టర్ వేయడం ఏంటని పలువురు ప్రశ్నించారు. కాగా గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామ సభల వద్ద సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో వేతనదారులు ఇబ్బందిపడు తున్నారు. చాలాచోట్ల టెంట్లు వేయకపోవడంతో ఎండల్లోనే వేతనదారులు ఉంటూ ఇబ్బందిపడుతున్నారు.

విజేతలకు నగదు బహుమతులు

ఇచ్ఛాపురం: వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా నీలాపువీధి వినాయక కమిటీ సభ్యులు మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీల్లో ఆరు జట్లు పాల్గొనగా అందులో గెలుపొందిన జట్లుకు చాట్ల రామలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి నగదు బహుంతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సముద్రం ఇసుక తరలిస్తే చర్యలు

రణస్థలం: సముద్రం ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని శ్రీకాకుళం ఆర్డీవో సీహెచ్ రంగయ్య అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నాలుగు మండల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తీర ప్రాంతంలో ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. అదే విధంగా పోలీసు యంత్రాగం కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. సమీక్షలో జేఆర్ పురం సీఐ అవతారం, ఎస్ఐ చిరంజీవి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

జిల్లావాసికి ఉన్నత స్థాయి కమిటీలో స్థానం


బుడుమూరు రాజేష్

అరసవల్లి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారత పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో ఉన్నత విద్య, పరిశ్రమల కాంబినేషన్‌లో విద్య, ఉద్యోగ రంగాల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో జిల్లాకు చెందిన ఐతం ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్, ఇండస్ట్రీ రిలేషన్ అధిపతి డాక్టర్ బుడుమూరు రాజేష్‌ను సభ్యునిగా నియమించారు. ఈ సందర్భంగా రాజేష్ ఈ కమిటీ ద్వారా పరిశ్రమల అవసరాలకు తగినట్టుగా పాఠ్య ప్రణాళిక రూపొందించడం, అధునాతన కోర్సుల్లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం, ఇంటర్న్‌షిప్, ఉపాధి అవకాశాలు పెంపొందించే విధంగా ప్రణాళిక అమలు చేయనున్నట్లు తెలిపారు. కమిటీలో వివిధ మల్టీ నేషనల్ పరిశ్రమల సీఈవోలతో ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రాజేష్‌ను నియమించడంతో ఐతమ్ కళాశాల డైరెక్టర్ అభినందించారు.

జయప్రదం చేయండి

కంచిలి: ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీడీవో వి.నీరజ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. నేటి నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరుగు కార్యక్రమాలలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

ఏచూరి మరణం తీరని లోటు

అరసవల్లి: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి ప్రజా సంఘాల ఉద్యమాలకు తీరని లోటు అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి అన్నారు. సోమవారం నగరంలోని సంఘ కార్యాలయంలో జరిగిన మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా కమిటీ సమావేశంలో ఏచూరి మృతికి సంతాపం తెలియజేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి బి.ఉత్తర, కోశాధికారి ఏ.రాధ, సభ్యులు సీతమ్మ, లక్ష్మి, గీతాబాల, హారతి హాజరయ్యారు.

కేంద్రమంత్రికి పదవిపై హర్షం

ఇచ్ఛాపురం: కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకి ఆసియా పసిఫిక్ మినిస్టీరియల్ కాన్ఫరెన్స్ చైర్మగా ఎన్నికపై ఇచ్ఛాపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు హర్షం వ్యక్తం చేశారు. చైర్మన్‌గా ఎన్నికై జిల్లాకు వచ్చిన కేంద్రమంత్రిని ఆయన సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు

గుజరాతీపేట: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల వేడుకల్లో భాగంగా సోమవారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మండల విద్యాశాఖ అధికారి కె.పున్నయ్య, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ ప్రారంభించారు. ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, ఆర్ట్స్ కళాశాల మైదానంలో పలు క్రీడా పోటీలు నిర్వహించారు.

ఫొటోగ్రాఫర్ల కార్యవర్గం


ఎన్నికైన కార్యవర్గం ప్రతినిధులు

ఎచ్చెర్ల: ఫొటోగ్రాఫర్లు సోమవారం సమావేశమై కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల ఫోటో గ్రాఫర్ల సంఘ అధ్యక్షుడిగా ఇప్పిలి వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా పెయ్యల కొండలరావు, కార్యదర్శిగా ఉప్పాడ దుర్గబాబు, సహాయ కార్యదర్శి పైడి బాలరాజు, కోశాధికారిగా సువ్వారి చిరంజీవి, సహాయ కోశాధికారిగా గురుపాప కుమార్ మరికొంతమంది సభ్యులను ఎన్నుకున్నారు.